తొలి సమయం

ఆదివారం । 5 । జూలై । 2026

# రాజ్యాధికార సమరభేరిని జయప్రదం చేయండి

## ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్

తొలి సమయం మహబూబాబాద్ జూలై 4

వేల సంవత్సరాలుగా దేశానికి సేవ చేస్తున్న ఉత్పత్తి కులాల ప్రజలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ఈ నెల 5 న యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో ఏర్పాటు చేసిన రాజ్యాధికార సమరభేరి సభలో ఎస్సీ, ఎస్టీ, బి.సి మైనార్టీ ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్ పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ జిల్లా కేంద్రం అంబేద్కర్ సెంటర్ లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమరభేరి గోడ పత్రికలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. వేల సంవత్సరాలుగా దేశ ప్రజల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన మెజార్టీ ప్రజలకు రాజ్యాధికారం లేక, స్వాభిమానం లేక బానిసలుగా జీవనం ఎల్లదీస్తూ బతకలేక బలిదానాలు చేసుకుంటున్నారని, దోపిడి కులాల పార్టీల్లో బహుజన నాయకులు బానిసలుగా జీవిస్తున్నారని, స్వాతంత్రం వచ్చి 80 ఏండ్లు అయినా మెజార్టీ ప్రజలైన బి.సి లకు చట్టసభల్లో వాటా లేదని అలాంటి ప్రజల విముక్తి కోసం బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాటం చేస్తున్న తీన్మార్ మల్లన్న నాయకత్వంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో జరుగు రాజ్యాధికార పోరులో విద్యావంతులు, మేధావులు, విద్యార్థులు, మహిళలు, కార్మికులు, కర్షకులు, కవులు, కళాకారుల, ప్రజా సంఘాల నాయకులు, కుల సంఘాల నాయకులు, బి. సి సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు చాపర్తి కుమార్ గాడ్గే మాట్లాడుతూ బహుజన ప్రజలు కులాలకు, పార్టీలకు అతీతంగా రాజ్యాధికార సమరభేరి సభలో పాల్గొని విజయవంతం చేయాలని, ఎన్నో పోరాటాలకు పురుడు పోసిన నల్లగొండ జిల్లా భువనగిరి బహుజన రాజ్యాధికారానికి కూడా పురుడు పోయాలని, సర్దార్ సర్వాయి పాపన్న, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య లాంటి మహావీరులు యుద్ధం చేసిన నేలపై వారి స్ఫూర్తితో బహుజన రాజ్య స్థాపన కోసం శంఖారావం పూరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ చింతం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవం అంటే టిడిపి ద్వారా కమ్మలను, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం అంటే టి ఆర్ ఎస్ ద్వారా వెలమలను గెలిపించి ఆధిపత్య దోపిడీ కులాలకు అధికారం అప్పజెప్పిన బి.సి ప్రజలు నేడు బి.సి రాజ్యాధికారం కోసం జరిగే పోరులో కీలకపాత్ర పోషించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాది రాచకొండ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ బహుజన రాజ్యాధికారం కోసం బహుజనుల్లో ఎదిగిన న్యాయవాదులు, డాక్టర్లు, విద్యావంతులు పెద్ద ఎత్తున కదలిరావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టి ఆర్ పి వరంగల్ జిల్లా అధ్యక్షులు పెండెల సంపత్, న్యాయవాది జె జె స్వామి, వివిధ ప్రజా సంఘాల నాయకులు చింతం లక్ష్మీనారాయణ, డాక్టర్ చింతం ప్రవీణ్ కుమార్, సూరం నిరంజన్, తాటికొండ సద్గుణ, ముత్తోజు పద్మ, జల్లెల కృష్ణమూర్తి, లక్ష్మణ్ గౌడ్, బూరు రవి, ఎన్ ఎస్ రాజు, బీస మహేష్, ప్రకాష్, ఎల్లస్వామి యాదవ్, జన్ను శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## కామారంలోనే ఆశ్రమ పాఠశాల కొనసాగించాలి: తుడుందెబ్బ డిమాండ్

### అధికారుల నిర్లక్ష్యంతో విద్యా ప్రమాణాలు దెబ్బతిన్నాయి

### పాఠశాల తరలిస్తే ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలు తప్పవు

### కుంజ నర్సింగరావు హెచ్చరిక

తొలి సమయం కొత్తగూడ 04 జూలై 2026



గంగారం మండలం కామరాం గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను ఇతర ప్రాంతానికి తరలించకుండా అదే గ్రామంలో కొనసాగించాలని తుడుందెబ్బ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు కుంజ నర్సింగరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలోని ఈ ఆశ్రమ పాఠశాల ఎన్నో ఏళ్లుగా గిరిజన విద్యార్థులకు విద్యను అందిస్తున్నప్పటికీ, తగిన సంఖ్యలో ఉపాధ్యాయులను నియమించకపోవడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల విద్యా ప్రమాణాలు గణనీయంగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలను పట్టించుకునే అధికారులు లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిందని, దీనికి పూర్తిగా అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. ఈ పరిస్థితిని సరిదిద్దాల్సిన అధికారులు చర్యలు తీసుకోకుండా, విద్యార్థుల సంఖ్య తగ్గిందనే కారణంతో పాఠశాలను మరో మండలానికి తరలించే ప్రయత్నం చేయడం సరైన నిర్ణయం కాదని విమర్శించారు. పాఠశాలను తరలించే ఆలోచనను విరమించుకుని, అవసరమైన ఉపాధ్యాయులను నియమించడంతో పాటు అధికారుల పర్యవేక్షణను పెంచి కామరాం గ్రామంలోనే ఆశ్రమ పాఠశాలను కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పాఠశాల పరిరక్షణకు చర్యలు తీసుకోకపోతే గ్రామ ప్రజలు, ప్రజా సంఘాలతో కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కుంజ నర్సింగరావు హెచ్చరించారు.

## సర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు బిఎల్ఏలు సైనికుల్లా కష్టపడాలి

### ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండాలి

### కాంగ్రెస్ నాయకులు యాసరపు నరసింహారావు

తొలిసమయం, లక్ష్మీదేవిపల్లి, జూలై 04 :



ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రజలు తమకు బిఎల్ఓలు అందించిన ఎన్యూమరేషన్ ఫారాలను ఎలాంటి తప్పులు లేకుండా పూరించి సకాలం లో అధికారులకు అందించాలని కాంగ్రెస్ నాయకులు యాసరపు నరసింహారావు పిలుపుని చ్చారు. ఈ క్రమంలో అవగాహనా లేని ప్రజలకు పార్టీ నియమించిన బిఎల్ఏ తమ సహకారాన్ని అందించి ప్రతి ఒక్కరు సర్ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాలను సరిదిద్దేందుకు సహకరించాలని, ఎటువంటి చిన్న తప్పిదం జరిగిన ఓట్లు గల్లంతయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ఏమ్యూనరేషన్ ఫామ్ లు మీకు అందకపోతే మీ గ్రామ పరిధిలోని పార్టీ బిఎల్ఏ లు, ప్రభుత్వ బిఎల్ఓ లను సంప్రదించాలని యాసరపు సూచించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రజలు ప్రత్యేక సవరణ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని అన్నారు. అధికారులు ఇంటింటికి వచ్చినప్పుడు అవసరమైన పత్రాలు, వివరాలను అందించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ప్రతి ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదు కావాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాల్సిన బాధ్యత బీఎల్ఏల పై ఉందని అందరు అప్రమత్తంగా ఉండాలని, ఓటరు నమోదు, వెరిఫికేషన్ ప్రక్రియ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని, బిఎల్ఓ లు, బిఎల్ఏ లతో పాటుగా ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఓటర్ల జాబితా సవరణలో బూత్ లెవల్ ఏజెంట్లులు సైనికుల్లా పనిచేయాలి: హరిప్రియ నాయక్




తొలి సమయం ఇల్లందు;జులై, 04:

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున నియమితులైన బూత్‌లెవల్‌ఏజెంట్లులు సైనికుల్లా బాధ్యతతో పనిచేయాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోత్ హరిప్రియ నాయక్ అన్నారు. ఇల్లందు బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడంతో పాటు ప్రతి ఓటును పరిరక్షించే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. ఓటర్ల నమోదు, వివరాల సవరణ, పేర్ల తొలగింపు వంటి అంశాల్లో పారదర్శకత పాటిస్తూ, ముఖ్యంగా మహిళా ఓటర్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. బీఎల్ఓలతో సమన్వయంగా పనిచేస్తూ ప్రతి అర్హుడైన ఓటరు తన ఓటు హక్కును కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

## కామ్రేడ్ పరకాల నాగన్నకు విప్లవ జోహార్లు




తొలి సమయం, కొమరారం;జులై, 04:

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కొమరారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అరుణోదయ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కామ్రేడ్ పరకాల నాగన్నకు ఘనంగా నివాళులర్పిస్తూ సంతాప సభ నిర్వహించారు. గుగులోత్ బిచ్చన్న అధ్యక్షతన జరిగిన ఈ సభలో గ్రామ కార్యదర్శి మూడు మాలు, మండల నాయకుడు జోగా కృష్ణ, పీవైఎల్ రాష్ట్ర నాయకుడు మోతీలాల్ మాట్లాడుతూ, విప్లవ ఉద్యమం, సారా వ్యతిరేక పోరాటం, భూస్వామ్య వ్యతిరేక ఉద్యమం, కార్మిక, రైతు, యువత, మహిళల సమస్యలపై నాగన్న ఎన్నో చైతన్య గీతాలు రచించి ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చారని కొనియాడారు. జీవితాంతం కళారంగాన్ని, అరుణోదయ సంస్థను ప్రజా ఉద్యమాలకు అంకితం చేసిన ప్రజా కళాకారుడిగా ఆయన సేవలను స్మరించారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాలప్రతినిధులు పాల్గొన్నారు.

## పొగుళ్లపల్లి ప్యాక్స్‌లో చైర్మన్ పదవిపై ఉత్కంఠ..

### నామినేటెడ్ ఇన్‌ఛార్జి కమిటీకి ఎవరు సారథి?

### ప్రభుత్వ ఉత్తర్వులతో పదవి కోసం నాయకుల ప్రయత్నాలు అధిష్టానం నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి

తొలి సమయం కొత్తగూడ 04 జులై 2026




పొగుళ్లపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) నామినేటెడ్ చైర్మన్ పదవిపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. సహకార సంఘాల ఎన్నికల ప్రక్రియ ఆలస్యమవుతున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ప్యాక్స్‌లకు నామినేటెడ్ ఇన్‌ఛార్జి కమిటీల నియామకానికి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి కమిటీలో ఒక చైర్‌పర్సన్‌తో పాటు 12 మంది సభ్యులు ఉంటారు. ఈ కమిటీ ఎన్నికలు జరిగే వరకు లేదా గరిష్ఠంగా ఆరు నెలల పాటు బాధ్యతలు నిర్వర్తించనుంది. ఈ నేపథ్యంలో పొగుళ్లపల్లి ప్యాక్స్ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు అధికార పార్టీకి చెందిన పలువురు నాయకులు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ పదవి ద్వారా మండలంలో తమ రాజకీయ పట్టు మరింత బలోపేతం చేసుకోవాలనే లక్ష్యంతో నాయకులు అధిష్టానం వద్ద లాబీయింగ్ చేస్తున్నట్లు సమాచారం. అయితే సహకార సంఘాల్లో పారదర్శకతకు పెద్దపీట వేయాలని, అర్హత, సేవా దృక్పథం కలిగిన వారికే బాధ్యతలు అప్పగించాలని మంత్రి సీతక్క పార్టీ నాయకత్వానికి సూచించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అధిష్టానం తుది నిర్ణయం ఎవరికి అనుకూలంగా ఉంటుందనే అంశంపై మండలవ్యాప్తంగా ఆసక్తికర చర్చ జరుగుతోంది. నామినేటెడ్‌కమిటీనియామకంపైప్రభుత్వం త్వరలోనే స్పష్టత ఇవ్వనున్న నేపథ్యంలో, పొగుళ్లపల్లి ప్యాక్స్ చైర్మన్ పదవి ఎవరిని వరించనుందో అన్నఉత్కంఠ కొనసాగుతోంది.

## దొడ్డి కొమరయ్య జీవిత చరిత్రను పాఠ్యాంశాలుగా ప్రవేశపెట్టాలి

### డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్



తొలి సమయం, కామేపల్లి; జులై, 04:

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి అంకురార్పణ చేసి అమరుడైన దొడ్డి కొమరయ్య జీవిత చరిత్రను విద్యార్థుల పాఠ్యాంశాల్లో ప్రభుత్వం అధికారికంగా చేర్చాలని డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా యాదవ యువజన అధ్యక్షుడు చిత్తారు సింహాద్రి యాదవ్ డిమాండ్ చేశారు. దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి సందర్భంగా కామేపల్లి మండలం పండితాపురం గ్రామం, ఖమ్మంలోని లకారం ట్యాంక్‌బండ్ వద్ద ఆయన చిత్రపటం, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ, నిజాం పాలన, వెట్టి చాకిరి, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన దొడ్డి కొమరయ్య నేటి తరానికి స్ఫూర్తిదాయకుడని అన్నారు. ఆయన త్యాగాలను భావితరాలకు తెలియజేయడానికి పాఠ్యాంశాల్లో చోటు కల్పించాలని కోరారు. అలాగే తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన యాదవులకు జనాభా నిష్పత్తి మేరకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని, యాదవులు, కురుమలు ఐక్యంగా ఉంటే తమ హక్కులను సాధించుకోవచ్చని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ ఓబీసీ సెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ వార్తను ఇంకా చిన్నదిగా లేదా పత్రిక కాలమ్ పరిమాణానికి తగ్గట్టుగా కూడా సిద్ధం చేయగలను.

## వేగవంతమైన దర్యాప్తుతో సంచలన హత్య కేసు ఛేదన..

### పోలీసు బృందానికి ఎస్పీ శబరీష్ ప్రశంసలు

### హత్యకు ఉపయోగించిన ఆయుధం, మొబైల్ ఫోన్లు, వాహనాల స్వాధీనం

తొలి సమయం మహబూబాబాద్ 04 జులై 2026




మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగారం గ్రామంలో సంచలనం సృష్టించిన పిట్టల యాకయ్య హత్య కేసును పోలీసులు వేగంగా ఛేదించి ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతి రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. కేసు దర్యాప్తులో శాస్త్రీయ ఆధారాలు, సాంకేతిక సాక్ష్యాలు, మొబైల్ ఫోన్ కాల్ డేటా, సీసీటీవీ ఫుటేజ్, నిందితుల విచారణలో లభించిన సమాచారంతో హత్య వెనుక ఉన్న కుట్రను పోలీసులు వెలికితీశారని తెలిపారు. దర్యాప్తులో మృతుడు పిట్టల యాకయ్యకు అతని భార్య పిట్టల యశోదతో చాలాకాలంగా కుటుంబ కలహాలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. మృతుడిపై అక్రమ సంబంధాల అనుమానంతో అతనిపై ద్వేషం పెంచుకున్న యశోద, ఎలాగైనా హత్య చేయాలనే ఉద్దేశంతో అదే గ్రామానికి చెందిన గంగుల కృష్ణ అలియాస్ కృష్ణయ్య, నీలకుర్తి మోహన్ రెడ్డి, తుమ్మిడి నర్సమ్మలతో కలిసి కుట్ర పన్నినట్లు వెల్లడైందన్నారు. ఈ కుట్రలో భాగంగా మర్త కృష్ణమూర్తి ద్వారా గంగరబోయిన వెంకన్న, సుంచు శివలను హత్య చేసేందుకు నియమించినట్లు దర్యాప్తులో తేలిందని డీఎస్పీ తెలిపారు. జూన్ 30 అర్ధరాత్రి నుంచి జూలై 1 తెల్లవారుజామున మధ్య నిందితులు సింగారం గ్రామంలోని మృతుడి ఇంట్లోకి ప్రవేశించి, ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న యాకయ్యపై ఇనుప రాడ్‌తో తలపై దాడి చేసి హత్య చేసినట్లు విచారణలో నిర్ధారణ అయ్యిందన్నారు. ఈ కేసులో మొత్తం ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన ఒక ఇనుప రాడ్, పరస్పర సమాచారానికి ఉపయోగించిన ఏడు మొబైల్ ఫోన్లు, నేరానికి వినియోగించిన రెండు మోటార్ సైకిళ్లు, ఒక బంగారు చైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును అత్యంత వేగంగా, సమర్థవంతంగా ఛేదించిన దర్యాప్తు బృందాన్ని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శబరీష్ అభినందించారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ రూరల్ సీఐ, రూరల్ ఎస్ఐలు ఎఫ్. రాజు, కె. రవికిరణ్, కురవి ఎస్ఐ బి. సతీష్, ఎన్. అంజలి, అలాగే పోలీసు సిబ్బంది వెంకటరమణ, బాలరాజు, సురేష్, మెషీన్, మధు, లింగారావు, ఉమ, సుధారాణిల సేవలను ఎస్పీ ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రజల భద్రత కోసం ఇదే తరహాలో శాస్త్రీయ దర్యాప్తుతో నేరాల నియంత్రణకు పోలీసులు కట్టుబడి ఉంటారని ఆయన పేర్కొన్నారు.

## కుంజవారి గుంపులో బొడ్రాయి, నాభిశిల, ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహణ





తొలి సమయం, ఇల్లందు;జులై, 04:

ఇల్లందు మండలం సుదిమల్ల గ్రామపంచాయతీ పరిధిలోని కుంజవారి గుంపులో బొడ్రాయి నాభిశిల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడింది. గ్రామ ప్రజలు, పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా వేద పండితులు మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. నిర్ణీత ముహూర్తంలో బొడ్రాయి, నాభిశిల, ముత్యాలమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించి గ్రామానికి శుభం, శాంతి, సౌభాగ్యం కలగాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామ ప్రజలంతా సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని భక్తి పారవశ్యంలో పూజా కార్యక్రమాలను వీక్షించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ బొడ్రాయి గ్రామ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, గ్రామ రక్షణ, ఐక్యత, సౌభాగ్యానికి చిహ్నంగా భావిస్తారని తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామ ప్రజల మధ్య సోదరభావాన్ని, ఐకమత్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. మహిళలు మంగళహారతులు సమర్పించగా, యువత సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. గ్రామమంతా విద్యుత్ దీపాలతో, పూలతోరణాలతో అందంగా అలంకరించబడింది. భక్తి గీతాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంజ సుకణయ్య, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నేత ఇరప కాంతారావు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, దాతలు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిష్ఠా మహోత్సవాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం అనంతరం గ్రామ ప్రజలందరికీ తీర్థప్రసాదాలు పంపిణీ చేయడంతో పాటు గ్రామాభివృద్ధి, ప్రజల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.